ఆంధ్రప్రభ, డిసెంబరు 28, 1998

"గోవిందరావు నాకు అన్న వరస. అంటే నా భార్యకు బావ. ఈ వరస బాగానే ఉంది. కానీ అతడి వరసే బాగోలేదు –" అనుకున్నాడు సీతాపతి.

# తలుపు గడియ

మనిషి తలుపు గడియ తీస్తే కొత్త వ్యక్తుల పరిచయమవుతుంది. మనసు తలుపు గడియ తీస్తే కొత్త వ్యక్తిత్వాల పరిచయమవుతుంది.

ఈ సందేశాన్నివ్వడానికా అన్నట్లు సీతాపతి ఇంటికి, సీతకు పతి వచ్చాడు – ఎమ్మే పరీక్షలు రాయడానికి!

సీతాపతి భార్యపేరు సుబ్బలక్ష్మి. సీతకు పతిపేరు గోవిందరావు. సీతాపతికి గోవిందరావు దూరపు వరుసలో అన్న. సీత, సుబ్బలక్ష్మి దూరపు బంధుత్వమున్న స్నేహితురాండ్రు. ఆడవాళ్ళు కదా - ఎవరు ఎవరికి అక్క అవుతారో తెలియదు.

గోవిందరావు రాజమండ్రిలో బ్యాంకు ఉద్యోగి. సీత అక్కడే స్కూలు టీచరు. ఉద్యోగంలో జీతం పెరుగుదల కోసం ఆమె ఎమ్మేకి కట్టాల్సి వచ్చింది. భార్యకంటే తన డిగ్రీ తక్కువుండకూడదని గోవిందరావూ కట్టాల్సి వచ్చింది. మగవాడు కదా - గోవిందరావు ఎమ్మే పూర్తయితేనే పరీక్షలు రాయడానికి సీతకు లైన్ క్లియర్!

సీతాపతి హైదరాబాదులో ఓ పబ్లిక్ సెక్టారు కంపెనీలో కాస్త పెద్ద ఉద్యోగంలోనే ఉన్నాడు. కంపెనీ వారిచ్చిన క్వార్టరులో రెండు గదులు, ఒక హాలు, వంటిల్లు ఉన్నాయి. బాత్రూం ఒక్కటే కానీ ఒకేసారి ఇద్దరు స్నానం చేయగలిగేటంత విశాలంగా ఉంటుంది.

ఆ క్వార్టర్లో గోవిందరావు మూడు వారాలుండాలి. అతడికి మర్యాదా, మొహమాటం కూడా తగుపాళ్ళలో ఉన్నాయి. ముఖంలో సంస్కారమూ కనిపిస్తుంది. అందువల్ల సీతాపతి ఆఫీసుకు వెళ్ళిన సమయంలో అతడూ, సుబ్బలక్ష్మి ఏకాంతంగా ఉండాల్సివస్తే అది ఇబ్బంది కావచ్చునని సీతాపతి దంపతులకు స్ఫురించనైనా లేదు. పైగా, "నువ్వు ఇంట్లోనే ఉంటూ ఏ కాలక్షేపం లేదని గోలపెడతావు కదా, మా అన్నతో నీకు మంచి కాలక్షేపం" – అని సీతాపతి భార్యతో అన్నాడు.

సుబ్బలక్ష్మి గ్రాడ్యుయేటే కానీ ఉద్యోగం చేయడం లేదు. రొటీన్ జీవితమంటే

ఆమెకు విసుగు. జీవితంలో ఏదైనా సాధించాలని ఆమె కోరిక. అందుకని మంచి పుస్తకాలు చదువుతుంది. చదవడం వల్ల పుట్టిన ఆవేశం, పరిసరాలనుంచి స్పందన - మిళితం చేసి అప్పుడప్పుడామె కథలు రాస్తుంది. కార్టూన్లు గీస్తుంది. అవి భర్తకు చూపిస్తుంది. అతడు వాటిని తేలికగా తీసి పారేసి విశ్లేషించాననుకుంటాడు. అన్నీ తెలిసిన మహాజ్ఞానిలా తన పరిజ్ఞానానికి అందని విశేషాల్లో కూడా ఆమెకు సలహాలిస్తాడు. వంటింట్లో అట్టే పనిలేని ఈ రోజుల్లో కూడా ఆడది వంటింటి కుందేలుగా మిగిలి పోవడంలో సీతాపతివంటి ఆఫీసు కుందేళ్ళపాత్ర కూడా తక్కువది కాదు. ఆ విషయం సుబ్బలక్ష్మి గుర్తించినట్లే ఉంది, "స్వాతి చినుకులు ఆలిచిప్పల్లాంటి మీ చెవుల్లో పడ్డాయి. ముత్యపు చిప్పలకోసం ఎదురు చూస్తాన్లెండి-" అంటూ తన అభిప్రాయంలో భర్త పరిజ్ఞానాన్ని అంచనా వేసి చెబుతూంటుంది.

భార్య ఏమన్నా సీతాపతికి కోపం రాదు. అతడికామె ముచ్చటైన అందాలబొమ్మ. ఆమెనోట ఏం పలికినా అతడికి ముత్యాలొలికినట్లే ఉంటుంది. ఒక విధంగా సుబ్బలక్ష్మికిది బాగానే ఉంది. భార్యను బొమ్మలాకాక మనిషిలా  భావించే మగాళ్ళ ఇంట్లో కీచులాటల గురించి ఆమెకు బాగా తెలుసు.

"ముత్యాలచిప్ప ఆలిచిప్పకు అన్న కాకూడదని లేదు కదా! నా అదృష్టాన్ని మీ అన్నముందు పరీక్షించుకుంటాను. రెండూ ఒకేరకం చిప్పలైతే మాత్రం నాపని అంతే సంగతులు..." అంటూ సుబ్బలక్ష్మి భర్తవద్ద తన భవిష్యత్తును వ్యాఖ్యానించుకుంది.

అయితే మొదటిరోజు గోవిందరావును అంచనా వేసే అవకాశమామెకు రాలేదు. రోజంతా అతడు పుస్తకధ్యానంలోనే ఉన్నాడు. పగలు కాసేపు నిద్రపోయాడు కూడా! టిఫిన్, భోజనం, కాఫీలు - అన్నీ సీతాపతితోనే అయ్యాయి. ఆమె అతడి గదిలో నీళ్ళమగ్గు ఉంచడంతో మంచినీళ్ళక్కూడా ఆమెను పిలిచే అవసరం రాలేదతడికి. గోవిందరావనే వాడా ఇంట్లో ఉన్నాడన్న స్పృహకూడా కలుగని విధంగా ఆరోజు గడిచిపోయింది. అందుకని తన రొటీన్లో ఏ మార్పూ ఉండదని ఆమె అనుకుంది. కానీ రెండో రోజే....

సుబ్బలక్ష్మి స్నానం చేస్తూండగా తలుపు తోశాడు గోవిందరావు. గడియ ఊడి క్రిందపడి తలుపు భళ్ళున తెరుచుకుంది. సుబ్బలక్ష్మి సిగ్గుతో ముడుచుకుపోగా క్షణంపాటు అప్రతిభుడై ఆమెను చూసి, "సారీ!" అని వెనక్కు తిరిగివెళ్ళిపోయాడు గోవిందరావు.

ఇది జరిగిన సమయానికి సీతాపతి బెడ్రూంలో పేపరు చూస్తున్నాడు.

తలుపు చేరవేసి, ఆదరాబాదరాగా స్నానం అయిందనిపించి, వంటికి బట్టలు చుట్టబెట్టుకుంటూ జరిగిందానిని గురించి ఆలోచిస్తున్నది సుబ్బలక్ష్మి.

తలుపు గడియ వదులైన మాట నిజం. మరీ ఇంత వదులైందని తెలుసుకునే అవకాశం అంతవరకూ రాలేదు. ముందురోజు స్నానం చేసినపుడు కావాలనే గోవిందరావా గడియను వదులు చేయలేదు కదా! అదే నిజమైతే భర్త ఉండగానే ఇలా తలుపు తీసేటంత సాహసం చేస్తాడా?

అది తెలియక జరిగిన పొరపాటేనని సుబ్బలక్ష్మి సరిపెట్టుకుంది. జరిగిన విషయం భర్తకు చెప్పడానికి రాత్రయితేనే బాగుంటుందనుకుని - ఆఫీసుకు వెళ్ళేముందు, "బాత్రూం తలుపు గడియ ఊడింది. కొత్తది వేయించాలి" అని మాత్రం చెప్పింది.

సరేనన్నాడు గానీ సీతాపతి ఆ విషయాన్ని బుర్రకెక్కించుకోలేదు.

అతడు వెళ్ళిన గంటకు గోవిందరావు బయటకు వెళ్ళాడు. సుబ్బలక్ష్మికి అతడి కళ్ళబడాలంటే మొహమాటం వేసింది. అతడు వెళ్ళొస్తానని చెబితే తలెత్తి చూడకుండానే ఊఁ అంది. అడుగుల చప్పుడు బాగా దూరమయ్యాకే వీధి తలుపులు వేసుకుంది.

సాయంత్రం ఆఫీసునుంచి వచ్చిన భర్తను తలుపు గడియగురించి అడిగితే అతగాడు యథాలాపంగా, "రేపు చూద్దాంలే!" అన్నాడు.

"రేపు చూద్దాంలే అంటే రేపే చూస్తారు" అంటూ ఆమె శ్లేషించేసరికి సీతాపతి అసలు విషయమడిగి తెలుసుకుని కలవరపడ్డాడు.

గోవిందరావు తనకు అన్న వరస. అంటే భార్యకు బావ. ఈ వరస బాగానే ఉంది. కానీ అతడి వరసే బాగోలేదు అని శ్లేషించుకుని తన తెలివికి తనే మురిసిపోయి, 'నేనిలా మురిసిపోగల్గుతున్నానంటే నాకు గోవిందరావు మీద అనుమానం పుడుతున్నట్లు లేదు. అది పుట్టాలంటే సుబ్బుల్నింకా గుచ్చి గుచ్చి ప్రశ్నించాలి. కానీ అపుడు సుబ్బుల్నమానించినట్లు కదా!' అని కూడా అనుకున్నాడు. భార్యనీ విషయమ్మై ప్రశ్నించడమెలాగన్నదే తన అసలు కలవరమన్న నిజం గ్రహించాడు.

కాసేపటికి గోవిందరావు వచ్చాడు. అతడి ముఖం ఆనందంతో వెలిగిపోతోంది. అంతా కూర్చున్నాక ఎవరూ అడక్కుండానే, "ఈ రోజు నా కళ్ళు గొప్ప అదృష్టం చేసుకున్నాయి" అన్నాడు.

సుబ్బలక్ష్మి ముడుచుకుపోయింది. సీతాపతి పిడికిలి బిగిసింది. గోవిందరావదేమీ పట్టించుకోకుండా తన ధోరణిలో, "ప్రత్యక్షదైవం ఆనందబాబాకు నేను భక్తుణ్ని, ఇంతవరకూ నేనాయన్ను ఒక్కసారికూడా చూడలేదు. ఇపుడాయన హైదరాబాదులోనే ఉన్నారని చెప్పి మంజు నాకాయన దర్శనం చేయించింది. రేపే నా మొదటి పరీక్ష. అంతా శుభసూచకం" అన్నాడు.

సుబ్బలక్ష్మి తేలికగా నిట్టూర్చింది. సీతాపతి మాత్రం, "మంజు ఎవరు?" అన్నాడు.

"నా చిన్ననాటి స్నేహితురాలు మంజుల. పెళ్ళై ఈ ఊళ్ళోనే ఉంటోంది. అనుకోకుండా ఈరోజు బజార్లో కలిసింది-"

పరాయి ఆడపిల్లని - స్నేహితురాలే అయినా - పెళ్ళయ్యాక కూడా అలా చనువుగా మంజు అనడం నచ్చక, "పెళ్ళైన ఆడపిల్లల్ని చెల్లీ అనో, అక్కా అనో అంటే బాగుంటుంది కదూ!" అన్నాడు సీతాపతి వెంటనే.

దీనికి గోవిందరావు వెంటనే స్పందిస్తూ "నేను నా చెల్లెల్ని కూడా పేరు కుదించే పిలుస్తాను. మనసు తలుపులకు గడియలు వేస్తాయని - వరసలంటే నాకు నచ్చదు" అన్నాడు. అతడు వేదాంతమే మాట్లాడినా, ఆ మాటల్లో తలుపు గడియా, వరసల పట్ల

నిరసనా ఉండడంతో భార్యాభర్తలు భుజాలు తడుముకున్నారు.

"సుబ్బులూ, నాకో సుత్తివ్వు-" అన్నాడు సీతాపతి కసిగా.

"ఎందుకు?" అంది సుబ్బలక్ష్మి.

"తలుగు గడియంటే గుర్తుకొచ్చింది. బాత్రూం తలుపు గడియ ఊడిందన్నావుగా. మేకు కొట్టి బిగిస్తాను-" అన్నాడు సీతాపతి.

"దానికి నువ్వెందుకు? ఆఫీసులో ఫిర్యాదిస్తే చాలదూ?" అన్నాడు గోవిందరావు.

"ఆఫీసును నమ్ముకుంటే రిపేరుకి నెలలు పడుతుంది" అన్నాడు సీతాపతి.

"పట్టనీ - బాత్రూం తలుపేగా - అంత తొందరేమొచ్చింది?"

సీతాపతి మనసుడికిపోయింది. ఏమీ అనలేక, "ఏమో నాకు తొందరే మరి-" అన్నాడు. ఈలోగా సుబ్బలక్ష్మి భర్తకు సుత్తి తెచ్చి ఇచ్చింది. అతడా బాత్రూంలోకి నడిస్తే తనూ సాయం చేస్తానని గోవిందరావు అనుసరించాడు.

అంతదాకా బాత్రూం గోడలో ఉన్న చిన్న అలమారాలో ఉన్న పాతగడియను చూసి, "ఇది తుప్పుపట్టినట్టుందే - కొత్తది కొనాలనుకుంటాను" అంటూ తీశాడు గోవిందరావు. కాస్త అటూ ఇటూ కదిపేసరికి అది కాస్తా పుట్టుక్కున విరిగితే, "నేను చెప్పానా?" అన్నట్లు గర్వంగా చూశాడతడు.

భోజనాలై నిద్రకు ఎవరిగదుల్లోకి వారు చేరుకోగానే సీతాపతి భార్యతో, "ఆ గడియ తుప్పు పట్టలేదు. గోవిందరావు కావాలనే విరిచేశాడు" అన్నాడు.

"తుప్పు పట్టని గడియను పట్టి చేతులతో విరిచేటంత బలం అతడికుందన్న మాట! నిజమే - నిన్న స్నానానికి వెడుతున్నపుడు చూశాను. కండలు తిరిగిన శరీరం అతడిది" అంది సుబ్బలక్ష్మి భర్త మాటలను సమర్థిస్తూ.

స్నానానికి వెడుతున్న గోవిందరావును కండలు తెలిసేటంత పరీక్షగా చూసింది సుబ్బలక్ష్మి. అతడు సుబ్బలక్ష్మిని స్నానం చేస్తున్నపుడే చూశాడు. వ్యవహారం శృతిమించుతోందనిపించిన సీతాపతికి 'భార్య మనసును గోవిందరావు శరీర సౌష్టవం నుంచి మళ్లించడం' తక్షణ కర్తవ్యంగా తోచి, "ఊరికే అన్నాను గానీ గడియ నిజంగానే తుప్పు పట్టిందిలే - నేను పట్టుకుని ఉంటే నా చేతిలోనే విరిగేది" అన్నాడు.

సుబ్బలక్ష్మి కిసుక్కున నవ్వి, "మీ చేతుల్లోనా - తుప్పు పట్టిన గడియ కూడా విరగదు" అంది.

సీతాపతికి చివుక్కుమంది. ఇలా మాట్లాడ్డం సుబ్బలక్ష్మికి కొత్తకాదు. గోవింద రావుతో పోల్చకుండా ఈ మాట అనివుంటే ఇపుడూ అతడు ఎంజాయ్ చేసేవాడు. తప్పుదారికి మళ్ళుతున్న సంభాషణనతడు ఆవులింతతో ఆపేశాడు.

మర్నాడు ఆఫీసుకు వెళ్ళగానే సీతాపతి తలుపు గడియగురించి ఫిర్యాదు రాస్తూ, 'వెరీ వెరీ అర్జెంటు' అని సూచించాడు. ఆ విభాగం చూస్తున్న సివిలింజనీరు - "తలుపు గడియలు కొత్తవి లేవు. కొన్నాళ్ళాగాలి-" అన్నాడు.

"కొన్నాళ్ళాగితే తలుపుకు గడియే అక్కర్లేదు-" అన్నాడు సీతాపతి గోవిందరావు

పరీక్షాకాలాన్ని తలుచుకుంటూ.

"ఓసారి ఫిర్యాదిచ్చేక మీరు వద్దన్నా మానం. మీరు అర్జంటని రాశారు కాబట్టి నేను కొత్త గడియలు కొనడానికి ప్రపోజలిస్తాను. అది అకౌంట్సు సెక్షన్ క్లియర్ చేశాక కొటేషన్లకి రాస్తా. టెండర్ ఓపెనింగ్ కమిటీ కొటేషన్లు తెరిచేక వాటిలోంచీ సరైనది ఎన్నికచేసి పర్చేజ్ ప్రపోజల్ ఇస్తాం. అది అకౌంట్స్ సెక్షన్ క్లియర్ చేయాలి. ఆపైన పర్చేజ్ కమిటీ ఆమోద ముద్ర పొందాలి. అపుడు ఆర్డరు వెడుతుంది. సరుకు సప్లై అయ్యాక అది బాగుందని సర్టిఫై చేసి స్టోర్సులో జమ చెయ్యాలి. స్టోర్సులో స్టాక్ ఎంట్రీ అయ్యాక - ఇస్యూస్లిప్ ఇచ్చి ఓ గడియ తీసుకుని మరమ్మతు చేయడానికి ఓ మనిషి మీ ఇంటికొస్తాడు" అన్నాడు సివిలింజనీరు.

ఈ వ్యవహారమంతా సీతాపతికి తెలియంది కాదు. ఒక్కొక్కచోట ఫైలు ఎంతకాలముండిపోతుందో కూడా అతడికి తెలుసు. ఏటా మెంబర్లు మారే పర్చేజి కమిటీలో ఓ ఏడాది అతడూ మెంబరుగా ఉన్నాడు. ఏం కావాలన్నా ఆ కమిటీ ఎన్ని యక్ష ప్రశ్నలు వేస్తుందో ప్రత్యక్షంగా చూడ్డమే కాదు - తానే ఓ అడ్డుపుల్ల వేసి వినోదించిన సందర్భాలూ ఉన్నాయి. సీతాపతి కారణంగా గణేష్ అనే కొలీగ్‌కి మల్టీప్లగ్‌లాంటి చిన్న అయిటం కొనడానికి ఆరుమాసాలు పట్టింది. గణేష్ అతడిమీద పగబట్టి సమయంకోసం ఎదురుచూస్తున్నాడు. ఇపుడతడు పర్చేజి కమిటీ మెంబరు.

"మీ దగ్గర పాత గడియలేమీ ఉండవా? నాకు పాతది వేసినా చాలు..."

"హమ్మో! అందుకు రూల్సొప్పుకోవు. గడియ మార్చాలంటే కొత్తది కొని తీరాల్సిందే-"

"గడియ ధర ఎంతుంటుంది?"

"కంపెనీకైతే ఎంత పడుతూందో తెలియదు. మనం కొనుక్కుంటే పదో పదిహేనో ఉంటుంది-"

"నేనే కొనుక్కుంటే పోలా-" అని క్షణమాత్రం అనిపించింది సీతాపతికి. కానీ మనదేశంలో ఏ ప్రభుత్వోద్యోగి అయినా - భార్య శీలం పోయేలా ఉంటే మాత్రం - ప్రభుత్వపు స్థిరచరాస్తులమీద ఒక్కటంటే ఒక్కపైస ఖర్చుపెట్టగలడా?

కాస్త నిరుత్సాహంగానే ఆ సాయంత్రం ఇల్లు చేరిన సీతాపతికి అక్కడ గోవిందరావూ, సుబ్బలక్ష్మి కిలకిలా నవ్వుకుంటూ కబుర్లాడుతూ కనబడ్డారు. ఆ జంట ఎంతో బాగుందని అప్రయత్నంగా తోచి మనసు చివుక్కుమన్న సీతాపతి ఎలానో తమాయించుకుని, "వచ్చి ఎంతసేపయింది?" అని గోవిందరావు నడిగాడు.

"పేపరు ఈజీగా వుంది. చాలా బాగా రాశాను. ఆ ఉత్సాహం పంచుకుందుకు వెంటనే ఇంటి కొచ్చేశాను. నువ్వు లేకుండా కాలక్షేపమవుతుందా అనుకున్నాను. కానీ అమ్మో - సుబ్బులుంటే టైము తెలియదు. నువ్వొచ్చి అడిగేదాకా నేనొచ్చి గంటన్నరైందని తెలియనే లేదు-" అన్నాడు గోవిందరావు.

అతడు తన భార్యను సుబ్బులనడం సీతాపతికి నచ్చలేదు. భార్యకూడా చిరాకు

పడుతుండాలనుకుని ఆమెవైపు తిరిగితే ఆమె భర్తవైపే చూడకుండా, "ఇందులో నాదేముంది? జోక్కు చెప్పింది మీరు. విన్నది నేను. నాకూ టైం తెలియలేదు. కాఫీ సంగతి కూడా మరిచాను–" అంటూ ఉత్సాహంగా లేచింది.

అంటే సుబ్బలక్ష్మి గంటన్నరనుంచి కాఫీమాట కూడా మరిచి గోవిందరావుతో కబుర్లాడుతోందన్నమాట! సీతాపతికి ఉక్రోషం పెరిగిపోయి, "నీకు జోక్సెలా తెలుసు?" అన్నాడు – గోవిందరావు విషయంలో అది చాలా ఆశ్చర్యపడాల్సిన విషయంలా –

"కాలేజి రోజుల్లో ఆడపిల్లలను ఆకట్టుకోవాలనుకునే ప్రతి అబ్బాయికీ జోక్సు సేకరించడం హాబీగా ఉంటుందని నీకు తెలియదా?" అన్నాడు గోవిందరావు.

"ఆయన సంగతే చెప్పాలి. జోకంటే ఆయనకు పిలక ఊగాలి, మొహం మీద వరిపిండి పడాలి. లావుపాటివాళ్ళు డాన్సు చేయాలి – అన్నీ విజువల్సే! చెవులతో పని ఉండదు. శ్రీవారి ప్రేమలేఖ సినిమా చూస్తూ ఒక్కసారి కూడా నవ్వలేదు. ఎలాగుందీ అంటే సస్పెన్సు బాగుందన్నారు" అంది సుబ్బలక్ష్మి.

గోవిందరావు కిసుక్కున నవ్వాడు. సీతాపతిముఖం ఎర్రబడితే, "చూశారా, ఈ జోక్కి కూడా నవ్వలేదు. ఇదీ ఈయన వరస–" అని లోపలికి వెళ్ళింది.

బట్టలు మార్చుకునే వంకతో తనూ లోపలకు వెళ్ళిన సీతాపతి వీలైనంత తగ్గు స్వరంతోనే గోవిందరావుతో ఆమె చనువును నిరసించాడు. సుబ్బలక్ష్మి వెంటనే లెంపలేసుకుని, "పాపమండీ, ఆయన మనసు నిర్మలమైంది. మన మనసులో కల్మషముంటేనే ఆయనలో తప్పు కనబడుతుంది. నేనాయనతో చనువుగా మాట్లాడగలుగుతున్నానంటే మా ఇద్దర్లోనూ కల్మషం లేకపోవడమే కారణం, మీరూ మాతో కలవండి–" అంది.

భార్య తన చేయిదాటిపోతోందా అన్న భయంతోపాటు ఆమె మాటల్లో నిజముందని తోచిన సీతాపతి బట్టలు మార్చుకుని గోవిందరావు వద్దకు వెళ్ళాడు. అతడు తను చూస్తున్న పేపర్ని సీతాపతి కిచ్చి కళ్ళజోడు తీసి తుడిచి జేబులో పెట్టుకున్నాడు. సీతాపతి పేపరు చదవకుండా అతడేమైనా జోక్సు చెబుతాడేమోనని చూశాడు కానీ సుబ్బలక్ష్మి పక్కన లేక ఉత్సాహం చచ్చిపోయిందో ఏమో – అతడు చాలా గంభీరంగా ఉన్నాడు.

సీతాపతి పేపరు తెరిచాడు. అంతలో సుబ్బలక్ష్మి అలా వచ్చి, "క్రిందింటి పద్మావతి బజారుకెళ్ళింది. తాళాలు మనింట్లో ఇచ్చింది. వాళ్ళాయన టూర్లో ఉన్నారుట. వాళ్ళబ్బాయి స్కూల్నించి వస్తే తాళాలివ్వాలి. వెంటనే పంపించేయక కాఫీకి ఆగమనండి–" అంది.

"మీ ఆయన పేపరు చదువుతున్నాడు కాబట్టి ఈ డ్యూటీ నాది. అబ్బాయి ఎన్నేళ్ళ వాడేమిటీ?" అన్నాడు గోవిందరావు చనువుగా.

"పదిహేనేళ్ళుంటాయి. టెన్తు చదువుతున్నాడు. కానీ ఇప్పటికే మీ అంత ఉంటాడు. బాగా పొడగరి–" అని వెళ్ళిపోయింది సుబ్బలక్ష్మి. అప్పుడు సీతాపతికి తను కాస్త పొట్టి అని స్ఫురించి మరింత ఉక్రోషంతో పేపర్లోంచీ తలెత్తలేదు.

కాసేపయింది. "రా ఇలా కూర్చో!" అంటూ గోవిందరావు తన పక్క చోటు చూపిస్తూంటే సీతాపతి చటుక్కున తలెత్తిచూస్తే - గుమ్మంలో పద్మావతి! ఆమె ఏమనాలో తెలియక ఇబ్బంది పడుతూంటే, "గోవిందరావ్- వాటీజ్ దిస్!" అన్నాడు సీతాపతి కోపంగా.

"ఏమయింది? కింద వాళ్ళబ్బాయిని కాఫీకుంచమని సుబ్బులేగా చెప్పింది!" అన్నాడు గోవిందరావు అమాయకంగా.

"అయితే అబ్బాయికీ వాళ్ళమ్మకూ తేడా తెలియదా నీకు?"

గోవిందరావు చటుక్కున కళ్ళజోడు పెట్టుకుని పద్మావతిని చూసి, "అయాం ఎక్స్ట్రీమ్లీ సారీ! కళ్ళజోడు లేకుంటే నాకు ఆడా మగా గుర్తు తెలియదు. అంతా అలుముకుపోయినట్లు కనబడతుంది." - అంటూ ఆమెకు అదేపనిగా క్షమార్పణలు చెప్పుకున్నాడు. అతడిలో ఏ మాయ ఉందో కానీ ఆమె అక్కడ కాసేపుండి - కాఫీ తాగి - వెళ్ళిపోయేటపుడు, "ఈయన చాలా సరదా మనిషి. వెళ్ళేలోగా ఓసారి మా ఇంటికి తీసుకురండి-" అని ఆహ్వానాన్ని కూడా అందించి మరీ వెళ్ళింది.

అపుడు సీతాపతిలో ఆశ్చర్యం కంటే ఆశే ఎక్కువగా పుట్టింది. మాటల సందర్భంలో అడిగినట్లు "నీ దృష్టి మాంద్యం ఈ స్థాయికి చేరుకుందని నాకు తెలియదు. నువ్వు బాత్రూంకి కూడా కళ్ళజోడుతో వెళ్ళాలి కాబోలు-" అన్నాడు. సుబ్బలక్ష్మి వంటింట్లో ఉండడంతో కాస్త ధైర్యంగానే ఈ ప్రశ్నను వేయగలిగాడు సీతాపతి.

గోవిందరావు నవ్వి, "నువ్వెందుకడుగుతున్నావో అర్థం చేసుకోగలను. నాకు అమ్మ ఉంది. చెల్లి ఉంది. ఇంట్లో ఉన్నాక ఏదో సందర్భంలో ఏడాదికోమారైనా బాత్రూంలోనో, బట్టలు మార్చుకుంటూండగానో వాళ్ళను చూడ్డం జరుగుతూనే ఉంటుంది. ఇబ్బంది పడితే క్షణమాత్రం - అంతే! అనుక్షణం ఆ దృశ్యాలు గుర్తుచేసుకుంటూ బ్రతకం కదా! ఎటొచ్చీ మళ్ళీ అలా జరక్కుండా జాగ్రత్తపడతాం. జరిగినా యథాలాపంగా తీసుకోవడం అలవాటు చేసుకుంటాం. అయినవాళ్ళింట్లో అలాగే మసలాలి. మసలగలగాలి-" అన్నాడు.

ఈ సామ్యం సీతాపతికి నచ్చింది. కానీ అలాంటి దృశ్యాల్లోంచీ జీవితపు మలుపులు సృష్టిస్తున్న సమకాలీన సాహిత్యం, సినిమాలు - వాతావరణాన్ని కలుషితం చేస్తుంటే, ఆ కాలుష్యం మనిషి ఆరోగ్యాన్ని సక్రమంగానూ, మనసును నిర్మలంగానూ ఉంచగలదా?

సీతాపతి ఆలోచనలు చదివినవాడిలా, "మనసుంటే తలుపు తోయకుండా తలుపు అవతల దృశ్యాలు చూడవచ్చు. మనసునెవ్వరూ ఆపలేరు. అయినా తలుపు గడియను మాత్రమే నమ్ముకునేవారుంటారు. నా దృష్టి మాంద్యం తలుపు గడియలాంటిది. దాన్ని నమ్మడం నీ భార్య మనసును తేలిక పరుస్తుంది-" అన్నాడు గోవిందరావు మళ్ళీ.

ఆ తర్వాత ఆ ఇంట్లోమళ్ళీ తలుగు గడియ ప్రసక్తి రాలేదు. కానీ సీతాపతి గోవిందరావునుంచి కొత్త వ్యక్తిత్వం సంతరించుకుని ఆ వ్యక్తిత్వం గురించి ప్రతిరాత్రీ

భార్యకు పదే పదే చెప్పి ఆమె అభినందనలాశించేవాడు. ఆమెకు మాత్రం అతడి కొత్త వ్యక్తిత్వమేమిటో అర్థం కాలేదు. ఎందుకంటే ఇప్పటికీ అతడామె కథలు కార్టూన్లూ చూసి పరిహసిస్తూనే ఉన్నాడు.

కొన్నాళ్ళుండి గోవిందరావు వెళ్ళిపోయాడు. ఒకరోజున తలుపు గడియ వేయడానికి ఆఫీసునుంచి మనిషి వచ్చాడు. అది పాతదిగానే ఉండడం చూసి సుబ్బలక్ష్మి చిరాకు పడితే ఆ మనిషి, "ఏం చెప్పేదమ్మా! ఆఫీసులో కొత్త గడియలున్నాయి. లేవని ఇంజనీరుబాబు అబద్ధం చెప్పాడు. అయితే ఎవరిళ్ళకూ కొత్త గడియలు వెయ్యరు. ఎక్కణ్ణించో పాతది సంపాదించి అదే వేస్తారు. కొత్తది అమ్మేసుకుంటారు. ఆఫీసులో కొత్త గడియ కొనడానికి పట్టేకాలంకంటే - పాత గడియలు వెతకడానికి పట్టేకాలమే ఎక్కువ. ఈ సారి పాతగడియ కాస్త తొందరగానే దొరకడం మీ అదృష్టం-" అని చెప్పి గడియవేసి వెళ్ళాడు.

అప్పటికే తలుపు గడియ గురించి ఎన్నో కొత్త విశేషాలు తెలుసుకున్న సుబ్బలక్ష్మికి - అది తన భర్త కొత్త వ్యక్తిత్వంతో కూడా సామ్యాన్ని కలిగి ఉన్నదని అర్థమయ్యింది. వెంటనే ఆమె మొత్తం తన అనుభవాలన్నింటినీ కథగా రాసింది. ఈ కథనామె భర్తకు వినిపించలేదు. ఏ పత్రిక్కో పంపిస్తే ఏ గోవిందరావో అది చదివితే అపుడు తన భర్తమీద ఆ ప్రభావం పడవచ్చునని ఆమె ఆశ!

✦ ✦ ✦